# అపూర్వం

"నేను నీకు తల్లిని కాను. నిన్ను కన్నతల్లిని నేను కాను. నిన్ను నా బిడ్డగా చూచుకున్నాను. కన్నబిడ్డ కంటే ప్రియంగా చూచుకొన్నాను. నీ అపోహను తొలగించడానికే ఈ లేఖ వ్రాయవలసి వచ్చింది. మొదట నువ్వనుకొన్నట్లే చాలా మంది అనుకొన్నారు. శరణాలయాధికారి నన్ను పూర్తిగా అనుమానించాడు. నేడూ అనుమానిస్తాడు. లోకమంతా అనుమానించినా నాకు చింతలేదు, కాని నువ్వు నన్ను తల్లి అని భ్రమ పడుతున్నప్పుడు నిజాన్ని దాచిపెట్టడం ఆత్మవంచనగా తోచి ఆ రహస్యాన్ని కాస్తా నీకు చెప్పదలచుకున్నాను.

నా జబ్బు శ్రుతిమించింది. బహుశా ఒకటి రెండు రోజుల్లో లేదా ఒకటి రెండు గంటల్లో కూడా నేను ఈ లోకాన్ని వదలి పెట్టవచ్చు. మా అమ్మ చచ్చి పోయిందని నువ్వు అనుకొంటావు. ఏడుస్తావు. మీ అమ్మ ఎక్కడ ఉన్నదో నీకు చూపెట్టాలనుకొన్నాను. కానీ పైకి లేచే స్థితిలో లేను. అంచేత చిరునామా మాత్రం తెలుపుతాను. నువ్వు వెళ్ళి మీ అమ్మను కలుసుకోవచ్చు. కాని నువ్వు ఆమె కుమారుడని ఈ లోకంలో ఇంకో మనిషికి తెలియకూడదు. అలా తెలిస్తే మీ అమ్మకు ఈ జగత్తులో స్థానం లేదు. అపరిమితమైన సంపదా, ఎంతో కీర్తి, మరెంతో ప్రఖ్యాతి కలిగి సంఘంలో ఆదర్శ మహిళగా ఎనలేని గౌరవాలను అందుకొంటున్న నీ తల్లి నీ మూలంగా అపఖ్యాతి పాలుకాకూడదు. ఏకాంతంగా నువ్వామెను కలుసుకోవలసి ఉంటుంది. నన్ను లక్ష్మి పంపింది. అని ఆమెతో చెప్పినంత మాత్రంలో ఆమె గ్రహించవచ్చు ననుకొంటాను.

ఇప్పుడు నువ్వనుకొంటూ ఉంటావు, ఐతే నే నెట్లా పుట్టాను? ఆ తల్లి ఎవరు? ఎక్కడుందోనని? నామీద కోపమూ, విసుగూ ఇన్నాళ్లు చెప్పనందుకు క్రోధమూ ఉంటుందనుకొంటాను. లోకం కోడై కూసినపుడు ఓర్చుకొన్నాను. ఊరంతా నామీద నిందను వేసినపు డూరుకొన్నాను. చివరికి కటకటాల మధ్య

ఐదు సంవత్సరాలు శిక్ష ననుభవించాను. నీ కోసం ఇన్నిపాట్లు పడ్డాను. నీకు నామీద జాలి కలుగుతుంది గాని కోపం రాదు. ఇక అసలు కథ వ్రాస్తాను.

నువ్వు పుట్టిందీ పెరిగిందీ వరుసగా చెబుతాను.

నేను దాసీ పిల్లను. నీ కన్న తల్లి విశాలాక్షి ఇంట్లో పనిచేస్తుండేదాన్ని.

విశాలాక్షికి పదహారేళ్ళపుడు ఒక సంఘటన జరిగింది. అది నా జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. నీ తల్లిని చీకటిలో బంధించింది.

వసారాలో నేను చెత్త వూడుస్తున్నాను. బాబుగారు సోఫాలో పడుకొని ఏదో పత్రిక చదువుకొంటున్నారు. నౌకరు కుర్రాడు వచ్చి ఎవరో మీ కోసం వచ్చారని కబురు చేశాడు. బాబుగారు పైకిలేచి పేపరు బల్లమీద పడవేసి వాకిట్లోకి వెళ్ళారు. ఐదు నిమిషాల కల్లా ఆయనతోపాటు మరో క్రొత్త మనిషిని లోపలికి తీసుకొచ్చాడు.

ఆ వచ్చిన మనిషి మీ మేనమామ. బాబుగారి కంటే కొంచెం పొడుగ్గా ఉన్నాడు. చేతిలో ఏదో చిన్న సంచీ ఉంది. ఎర్రని రంగు, నల్లని జుత్తు, మంచి ఆకర్షణీయమైన ముఖం.

"విశాలా! కాఫీ తీసుకురావే" అన్నారు బాబుగారు. విశాల రెండు మూడు నిమిషాల్లోనే రెండు కప్పుల కాఫీ తెచ్చి పెట్టింది.

ఆ క్రొత్త మనిషి ఆమెను పరిశీలనగా చూశాడు. ఆ చూపులో ఏదో కుటిలత కన్పించింది. పెళ్ళికాని పడుచులను అలా చూడ్డం తప్పు అని మళ్ళీ తెలుసుకో గలిగాను. అతని పేరు కాంతారావు. బాబుగారి స్నేహితుడు. ఇద్దరూ పట్నంలో చదువుకొంటున్నారు సెలవుల్లో సరదాగా బాబుగారితో ఉండటానికి వచ్చాడు. ఆ రోజు నుండి పదేను రోజుల వరకూ కాంతారావు వూళ్ళోనే ఉన్నాడు. విశాల స్వేచ్ఛగా అతనితో మాట్లాడుతూ ఉండేది. నాకంతవరకే తెలుసు అప్పటికి.

కాంతారావు వెళ్ళిపోయాక ఏడు మాసాలకు పిడుగులాంటి వార్త విన్నాను. అత్యంత భయంకరమైన ఆ విషాద వార్త ఎవ్వరికీ తెలియగూడదని విశాల తల్లి నాతో చెప్పింది. నే నెవ్వరికీ చెప్పలేదు. నేటివరకూ చెప్పలేదు. నీకు చెప్పక తప్పని పరిస్థితిలో చెబుతున్నాను.

ఇప్పటికి ఇరవై సంవత్సరాల క్రితం మన పల్లెటూళ్ళు ఏ స్థితిలో ఉండేవో నీకు తెలియదనుకొంటాను. యాభై మైళ్ళకో వైద్యశాల కూడా ఉండేదికాదు. ఆ స్థితిలో విశాల గర్భవిచ్ఛేదనం ఆసాధ్యంగా తోచింది. తండ్రికీ అన్నకూ తెలియకుండా ఏదో నాటు మందులు తీసియిచ్చింది. కానీ అవి తింటే అసలు

ప్రాణానికే ముప్పు వస్తుందేమోని భయపడి విశాల వూరుకున్నది.

చివరికి విశాల తండ్రికా విషయం తెలిసిపోయింది. అతడు చాలా పౌరుష వంతుడు. దూలానికి వురి వేస్తానంటూ తాడు తీసుకొన్నాడు. నలుగురూ వింటే బ్రతుకు బయటపడుతుందని మీ అవ్వ అతని కాళ్ళూ చేతులు పట్టుకొన్నది. అతడు కూడా ఆలోచించాడు. ఏదో వుపాయం తోచింది. ఆ మరునాడే నన్ను, విశాలను, విశాల తల్లిని పిలుచుకొని సరాసరి తిరుపతికి తీసుకువచ్చాడు. కపిలతీర్థానికి వెళ్ళే దారిలో ఇప్పుడున్న సత్రానికి కొంచెం దూరంలో ఓ గది అద్దెకు తీసి మమ్మల్ని అందులో వుంచాడు.

ఆ గదిని వదలి మేమెక్కడా వెళ్ళేవాళ్ళం కాదు. మీ తాత మాత్రం పగటిపూట ఎప్పుడో ఒక్కసారి అలా బైటికి వెళ్ళివస్తుండేవారు. బాబుగారికి తీర్థయాత్రలకు వెడుతున్నామని జాబు వ్రాసి ఆయనకు రెండు మాసాలకు కావలసిన డబ్బును పంపేశారు. ఊళ్ళోవాళ్ళు కూడా తీర్థయాత్రలకే వెళ్ళారని నమ్మారు. ఏడు కొండల వాని సమక్షంలో పాపఫలాన్ని అనుభవించే యోగం నాకుంటుందని నేను అనుకోలేదు. ఒక్కనెల గడిచింది మరో నెల గూడా గడిచింది.

ఆదివారం సూర్యోదయమపుడు నువ్వు పుట్టావు. నీ తల్లి గండం నుండి బయట పడింది. ఆ రోజంతా గడిచింది.

ఆ రాత్రి మీ తాతగారు, నన్ను, దగ్గరకు పిలిచి ఆయన నిర్ణయాన్ని నాకు చెప్పారు. నేను ఆపాదమస్తకం వణికిపోయాను. నాకు చెమట పట్టింది. నేనెవరో తెలుసుకోలేక పోయాను. కన్నతల్లికి లేని వేదన నాకెందుకు కలిగిందో తెలియదు.

అర్థరాత్రపుడు నిన్ను ఒక్కరోజైనా నిండని పసిగుడ్డును తీసుకెళ్ళి స్టేషనులో ప్రయాణికులు కూచునేచోట వదలిపెట్టి రమ్మని నాకు అప్పగించారు. నిన్నలా వదిలిపెట్టి వచ్చాక అందరూ కలిసి జట్కాబండిలో రేణిగుంట చేరుకోవాలి. అక్కడి నుండి కాళహస్తికి వెళ్ళి దైవదర్శనం చేసుకొని వూరికి వెళ్ళాలని.

చిన్ని కసుగందును పారవేసుకొని దేవుని దగ్గరికెందుకో గదా! ఈ పనిని నేను చేయక తప్పదని ముగ్గురూ ఏక కంఠంతో చెప్పారు. నేను వారివద్ద పని చేస్తున్న దాసీపిల్లను. వారి మాట వినక తప్పదు. కానీ ఇలాంటి ఘోరమైన కార్యాన్నెట్లా చెయ్యగలను?

నన్ను నిర్బంధించారు. గట్టిగా నిర్బంధించారు. రైలు స్టేషనులో వదిలిపెట్ట డానికి భయంగా వుంటే మరెక్కడైనా సరే పారేసి రమ్మన్నారు.

నాకు దుఃఖం వచ్చింది. అక్కడ ఏడిస్తే చుట్టుప్రక్కలవారు పోగౌతారు. మీ తాత నిన్ను మాంసం ముద్దలా చుట్టి నా చేతుల్లో పెట్టారు. నీ తల్లి కళ్ళు మూసుకొన్నది నన్ను చూడలేక. నీ అవ్వ విన్పించకుండా ఏడుస్తోంది. నేను నిన్ను తీసుకొని గబగబా అడుగులు వేస్తూ స్టేషన్‌వైపే దారితీసాను. మరెక్కడైనా పడేస్తే ఆ రాత్రిపూట నీ ప్రాణం నిలువదని నాకు తెలుసు. నలుగురిలో వదలి పెడితే నీవు బ్రతికే అవకాశం ఉంటుందని అనుకొన్నాను. నేను కడప దాటగానే జట్కా వచ్చి ఆగింది.

"త్వరగా రావాలి" అన్నాడు మీ తాత. నేను వేగంగా నడిచాను. సరిగ్గా కొత్త సత్రం దగ్గరకు వచ్చేనో లేదో నువ్వు కేరుమన్నావు. ఆ రోదనతోనే నిన్ను స్టేషన్ దాకా తీసుకెళ్లాను. బెంచీ క్రింద పడుకోబెట్టాను. కానీ నిన్ను వదలలేక పోయాను. వదలివెళ్ళే ధైర్యం లేకపోయింది. నీ చిన్నికళ్ళు, సంపెంగలాంటి అందమైన ముక్కు, గులాబి రేకుల్లాంటి చెక్కిళ్ళు, సన్నగా చిన్నిచిన్ని వ్రేళ్ళు, తామర కాడల్లాంటి చేతులు, ఎర్రని చివురుల్లాంటి పాదాలు అలాగే చూస్తూ వుండిపోయాను. అరగంట గడిచింది. గంట కూడా గడిచిందేమో!

ఉన్నట్టుండి మెలకువ వచ్చినట్లు గబగబా నిన్ను వదిలి వెళ్ళిపోయాను. కొత్తసత్రం దాటుకొని గదివద్దకు వెళ్ళాను. అక్కడ తలుపు మూసిన గది తెరచి చూశాను. చీకటిలో ఎవరూ లేరు. బండి వెళ్ళిపోయింది. ఏం చెయ్యాలి?

నన్ను పోలీసులు పట్టుకొని ఉంటారనే అనుమానంతో నీ తల్లి, నీ తాత, నీ అవ్వ పారిపోయారు. ఎలుగెత్తి ఏడుద్దామనుకొన్నాను. ఏడిస్తే ఏమౌతుంది, నలుగురు పోగౌతారు. ఆ వెనుక అసలు విషయం తెలుసుకుని తల్లిని ఖైదు చేస్తారు. ఆమె జీవితం నాశనమౌతుంది. మళ్ళీ నీ దగ్గరకు పరుగెత్తి వచ్చాను. ఆపాటికే నీ చుట్టూ గుంపు చేరిపోయారు. ఆ గుంపులో నుండి నిన్ను చూడ్డం అసాధ్యమనిపించింది. అప్పటికీ దగ్గరకు వెళ్ళాను. ఇంతలో నామీద బలమైన మనిషి వాలి పట్టుకొన్నాడు.

"ఇదే దొంగ ముండ ఇక్కడ వదలి పారిపోయింది."

ఒక్కసారిగా అందరి కళ్ళూ నామీద పడినై. వణికిపోయాను. కుప్పగా కూలిపోయాను. నన్ను అమాంతంగా ముందుకు తోసాడు పోలీసు నిన్ను తీసుకోమన్నాడు. పోదివి పట్టుకొన్నాను.

"ఇలా కనిపారేసి పారిపోతావూ? పాడుముండ ...." వంద మందికి

పైగా నావెంట పోలీసు స్టేషనుకు వచ్చారు. "దొంగ దొరికిపోయింది రోయ్" అంటున్నారందరూ! ఎన్నో కోతలు కోస్తున్నారు.

నేను ఒప్పుకొన్నాను. అందరిలోనూ నువ్వు నాకన్న కొడుకువని ఒప్పు కొన్నాను. కొండమీద బిచ్చమెత్తుకుంటూ బ్రతికేదాన్నని చెప్పాను. నీ నాన్న ఎవరని కూడా అడిగారు. అతని పేరు తెలియదని చెప్పాను. నన్ను వ్యభిచారిణిగా గుర్తించారు. నేను వ్యభిచారినని అతికష్టం మీద ఋజువు చేసుకున్నాను. నీ తల్లి భవిష్యత్తు నాచేతిలో ఉందని తెలుసు. నేనెటూ దాసీపిల్లను. కూటికి లేని దాన్ని. నీ తల్లి లక్షాధికారి బిడ్డ. ఆమె జీవితం నాశనం కాకూడదని నిర్ణయించు కొన్నాను. అంచేత ఆ మహాపరాధాన్ని నామీదే వేసుకొన్నాను.

వ్యభిచరించిన నేరంతో పాటు బిడ్డను పారవేసిన నేరం ఈ రెండు నేరాలనూ చేసినట్టు అంగీకరించాను. నాకు ఐదు సంవత్సరాల శిక్ష పడింది.

నిన్ను ఆస్పత్రికి తీసుకొని వెళ్ళారు. నన్ను చెరసాలకు అప్పగించారు.

ఏడుకొండలవాడి సమక్షంలో తప్పుచేసినందుకా నాకీ శిక్ష అనుకొన్నాను. నాకు చెరసాలలో ఉండటం దుర్భరమనిపించలేదు, కానీ నన్ను అందరూ నీచంగా చూసేవారు. ఒక్క పంతులమ్మ మాత్రం నన్నెంతో ఆదరించింది. ఆమె నేర్పిన అక్షరాలే నాకు చదువు, ఆ చదువుతోనే నీకు జాబు వ్రాయగలిగాను.

నిన్ను గురించి జైల్లో వున్నప్పుడు ప్రతినెలా తెలుసుకుంటూనే వచ్చాను. పంతులమ్మ ఈ విషయంలో నా ప్రాణాన్ని నిలభెట్టింది. ఐదు సంవత్సరాలలో నేనెన్నో నేర్చుకున్నానక్కడ. బాగా వ్రాయడం, చదవడంతోపాటు సిరిచాపలల్లడం, చిన్న చిన్న వుడుపులు కుట్టడం, బొమ్మలు కుట్టడం. ఒకటేమిటి నా జీవితానికి చాలినంత తిండిని సంపాదించగల్గిన చేతి పనులను నేర్చుకున్నాను.

నిన్ను ఆస్పత్రినుండి అనాధ శరణాలయానికి అప్పగించినట్టు తెలిసింది. అక్కడ నువ్వు బాగా ఎదుగుతున్నావని కూడా విని సంతోషించాను.

చెరసాలనుండి నన్ను వదిలిపెట్టారు. ముందు నిన్న చూడాలని వచ్చాను. నిన్ను గుర్తుపట్టడం ఎట్లా అనే ఆలోచన లేకపోలేదు. నీకుడి చెవి వెనుక ఒక పుట్టుమచ్చ ఉంది. ఈ మచ్చ వున్న విషయం మీ అమ్మకు కూడా తెలుసు. ఆ మచ్చను చూచి నిన్ను కనుక్కున్నాను.

ఏకాకిగా నేను మిగిలాను. స్వగ్రామం వెళ్ళడానికి బుద్ధిపుట్టలేదు. ఎలా వెళ్ళగలను? నిన్నెట్లా తీసుకెళ్ళగలను? ఇన్నాళ్ళూ ఎక్కడున్నావని తెలిసిన

వారడిగితే ఏమని చెప్పగలను? ఈ పిల్లవాడెవడని ప్రశ్నిస్తే సమాధానం ఏమివ్వ గలను? నిన్ను మళ్ళీ ఐదేళ్ళ పిల్లవాడుగా అక్కడికి తీసుకెడితే నీ తల్లి వూరుకొంటుందా? నీ తాత నిన్ను ఏమంటాడు? మళ్ళీ ఆ కుటుంబానికే చిచ్చుపెట్టి నట్లేగా?

అందుకనే ఆలోచించి నిన్ను అనాథ శరణాలయంలోనే వదలిపెట్టి బయటకు వచ్చాను. నా బ్రతుకుతెరువు నేను చూసుకోవాలి. అంతవరకూ నాకు పెళ్ళి కాలేదు. మగదిక్కులేని బ్రతుకు చాలా దుర్లభమైంది. ఐనా సాహసించాను. కాగితాలు, అట్టలూ సేకరించి బొమ్మలు చేసి అమ్మాలను కొన్నాను. అదే పని ప్రారంభించాను. ఇట్లా ఆరు మాసాలు గడిచింది. ఆలోగా నిన్ను ఆరుమార్లు చూశాను. ప్రతినెలా నిన్ను చూడకుండా ఉండలేకపోయేదాన్ని.

ఒకనాడెందుకో మీ అమ్మను చూడాలనిపించింది. ఈ బలీయమైన వాంఛ నుండి మరలలేక పోయాను. నాకా కోరిక ఎందుకు కలిగిందో చెప్పలేను.

సాయంకాలానికి సరిగ్గా వూరు చేరుకొని విశాలతో మాత్రం మాట్లాడి ఉదయం ఎవ్వరికీ కన్పించకుండా వచ్చేద్దామని అనుకొన్నాను. అలాగే వెళ్ళాను. ఆశ్చర్యమేమంటే నేను వెళ్ళిన రాత్రే విశాల పెళ్ళి.

నీ కన్నతల్లి పెళ్ళిపీటల మీద కూచుని ఉన్నది. ఎవరో తెలియదు పెళ్ళి కొడుకు. ఇద్దరికీ నలుగురు పెడుతున్నారు. బంధువులతో పెళ్ళిపందిరి కిటకిటలాడి పోతున్నది. నీతాత, నీ యవ్వ పెళ్ళి సంబరంలో లీనమైపోయారు. నీ మామ హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఆ సమయంలో విశాలను నేనెట్లా చూడగలను? ఏమని పలకరించగలను?

పెళ్ళికూతురైన నీ కన్నతల్లికి నీ క్షేమసమాచారాలతో పనేముంది? నాకప్పుడు కుంతీదేవి జ్ఞప్తికి వచ్చింది. కుంతీదేవికంటే నీ తల్లి నయమేమో అన్పించింది. నిన్ను నలుగురూ మెదిలేచోటు పెట్టమని పదేపదే చెప్పింది మీయమ్మ. నలుగురి కళ్ళల్లో పడితే ఏ పుణ్యాత్ముడో పెంచుకొంటాడు గదా! అనుకొన్నది మీయమ్మ. కుంతి అలాకాదు. గంగలో వదిలిపెట్టింది. చేతులారా నీటిలో పడేసి చంపలేక పెట్టెలో పెట్టి వదిలిపెట్టింది.

ఆ రోజున అనుకొన్నాను. ఆ పెళ్ళి పందిరిలోనే నిర్ణయించుకొన్నాను. పెళ్ళి చేసుకోరాదని తీర్మానించుకొన్నాను. నా నిర్ణయం ఎంత కఠినమైనదో, మరెంత దుస్సాధ్యమైందో నాకు తెలుసు. ఐనా నాకు జీవితం మీద విరక్తి పుట్టింది.

సన్యసించాను. నా జీవితం అలాగే గడిపివేశాను. అవసానదశలో ఉన్నానిప్పుడు. పురుష సాంగత్యంలేని జీవితం వృధా అంటారు కొందరు. కానీ నిన్ను కాపాడ గల్గిన నా జీవితం వృధా కాదు. నీ తల్లినీ, నీ తల్లి కుటుంబాన్ని, వారి గౌరవ ప్రతిష్టలను రక్షించగల్గిన నా జీవితం వృధా అవుతుందా?

విశాల నావైపు చూస్తుందనుకొన్నాను. ఆమె పెళ్ళికూతురు గదా? తల వంచుకొనే ఉన్నది. ఆ పెళ్ళి కుమారుడు కూడా అమాయకంగా చిరునవ్వుతో కన్పించాడు. వారికి నేను కన్పించడమే అమంగళమన్పించింది. నా ఉనికి కూడా వారికి ప్రమాదం కావచ్చు. ఆడవారి నోటిలో నువ్వు గింజ కూడా నానదంటారు. వారిలో రహస్యం దాగదంటారు. ఆ విధంగా అనుకొని నేనే సమయంలోనైనా రహస్యాన్ని బయటపెట్టగలనని నీ తల్లి భయపడవచ్చు. నీ తాత అనుమానించవచ్చు. ఒకవిధంగా నేనక్కడ ఉండడం నాకూ ప్రమాద మనిపించింది. పావుగంట కూడా ఆ పందిరిలో నిలబడలేకపోయాను. బయటకు వచ్చేశాను.

నీ కన్నతల్లిని పెళ్ళి చేసుకొన్నతడొక పెద్ద ధనికుడు. అతనికి నాలుగు వేల ఎకరాల ఆస్తి ఉందట. నలభై వేలు కట్నం తీసుకొంటున్నాడు. అంతంత పెద్ద సంబంధాలవి. ఆ మధ్య నేను విషపు చుక్కలాగా ఎందుకుండాలి?

ఆ మరునాడే వూరు చేరుకొన్నాను. నా నిత్యజీవితాన్ని ఆరంభించాను.

నీకు పదిహేను పూర్తి కాగానే స్కూల్ ఫైనల్ కూడా పూర్తిచేశావు. శరణాలయాధికారికి నామీద మంచి గురి ఉన్నది. ఆయన మొదటి నుండీ నువ్వు నా బిడ్డవని అనుమానిస్తూనే ఉన్నాడు. నువ్వు బయటికి వచ్చావు. ఈ లోకంలో నువ్వు స్వేచ్ఛగా బ్రతకాలని వచ్చావు.

నీ పేరుంది కానీ తండ్రి పేరు లేదు. తల్లి పేరూ లేదు. నువ్వు తెలుసు కోవాలన్నా నీకు తెలియదు. కానీ నన్నే తల్లి అనుకొన్నావు. నీ నమ్మకాన్ని నేను కాదనలేక పోయాను. నీ తండ్రి మోసంచేసి వదిలి వెళ్ళాడని చెప్పాను. నిన్ను చదివించాను. పదేళ్ళుగా సేకరించిన పైకాన్ని నీకోసం వెచ్చించాను. నువు వృద్ధికి వచ్చావు. నీకు పెళ్ళిచేసి ఒక యింటివాణ్ణి చెయ్యాలని అనుకొన్నాను.

కానీ ఇంతలో నాకీ జబ్బు వచ్చింది. నువ్వు ప్రతిరోజూ నా మంచం మీద కూర్చొని నా చేతిని పట్టి చూచినపుడల్లా నీకు నిజం చెప్పాలనిపించేది. నీ ప్రేమను నేను భరించలేను. నీ భక్తిని నేను ఇముడ్చుకోలేను. నీ ఆదరణకు నేను అర్హురాలను కాను. నేను నీ తల్లిని కాను కనుక నిన్ను వంచిస్తున్నానేమోననే

భయంతో నీకు నిజం చెప్పాలని వారం రోజులనుండీ తహతహపడుతున్నాను. కానీ మాటలతో చెప్పలేను, ఎలా చెప్పగలను?

నువ్వు అమ్మా అని నన్ను పిలిచినప్పుడల్లా నాకు విశాల జ్ఞప్తికి వస్తుంది. మీ అమ్మ ఉన్నచోటును చెబుతున్నాను. నీ తల్లిని వెళ్ళి కలుసుకో. ఎటు తిరిగీ నువ్వు తల్లిలేని బిడ్డ కాకూడదు, నేను గతించినా కన్నతల్లిని కలుసుకుంటే చాలు.

* * *

ప్రకాశరావు జాబును మడిచి జేబులో పెట్టుకొని ప్రశాంతంగా ఐదు నిమిషాలు ఆలోచించాడు. వెంటనే పైకిలేచి పిచ్చివానిలాగా ఆస్పత్రివైపు పరుగు తీశాడు.

గేటు తెరచుకొని లోపలికి వెళ్ళాడు. తొమ్మిదో నెంబరు మంచం మీద మూలుగుతున్నది పెంపుడు తల్లి.

"అమ్మా! అమ్మా!" అన్నాడు. ఆమె కన్నులు తెరిచింది. ప్రకాశరావు ఆమె పాదాలపై వ్రాలిపోయాడు. ఆమె కన్నులు మూసుకొన్నది.

ఐపోయింది ఆమె జీవితం! ప్రకాశరావు గుండెలు ఆగిపోయినట్టయింది.

తన ప్రేమసాగరం ఇంకిపోయింది తన మాతృమూర్తిని మించిన మహోన్నత మూర్తి వెళ్ళిపోయింది.

ఒక మహాసాధువువలె మౌనం వహించాడు. ఒక మహాయోగిపుంగవుని వలె నిబ్బరాన్ని చూపెట్టాడు. తన మిత్రుల కెవరికీ ఈ లేఖ విషయం చెప్పలేదు. చనిపోయింది తన తల్లి అని అందరూ అనుకొంటున్నారు. నిజానికి తాను కూడా అట్టే అనుకున్నాడు.

ఆమె భౌతిక శరీరానికి మరల మరల నమస్కరించాడు. తన మిత్రులే దహనానికి కావలసిన యేర్పాట్లన్నీ చేశారు.

తాను కన్నకొడుకు వలె కర్మను నెరవేర్చాడు. ఆమె చితాభస్మమును, అస్తికలను సముద్రంలో కలిపివేశాడు.

ఒక్కవారం రోజులు విశ్రాంతిగా కూచున్నాడు. గదిలో ఒంటరిగా ఆలోచించాడు. తల్లికంటే మిన్నయైన తల్లి వెళ్ళిపోయింది. తన తల్లికోసం జీవితాన్నే అంకితం చేసిన తల్లి వెళ్ళిపోయింది. తనకోసం అజ్ఞాతవాస మనుభవించిన తల్లి గతించిపోయింది.

అలాంటి తల్లి వెళ్ళిపోయిన వెనుక కన్నతల్లిని మాత్రం ఎందుకు చూడాలి? అసలు కన్నతల్లి లేదనుకోవడమే మంచిదేమో?

అంతఃపురంలాంటి భవనంలో దాసదాసీలతో కొడుకులూ, కూతుళ్ళు భర్త, మరదులు, బావలు, ఆడపడుచులు, అత్తామామల మధ్య కన్నతల్లి అమితానందాన్ని అనుభవిస్తున్నది.

ఇరువది సంవత్సరాలు గడిచిన వెనుక తన్ను చూడాలని ఆమె అనుకొంటుందా? తన్నానాడు ఆ తిరుపతి స్టేషన్లో నలుగురికీ అప్పగించి పాషాణ హృదయంతో వెళ్ళిపోయిన తల్లిని ఎందుకు చూడాలి? ఎలా చూడాలి?

ఒక్కరోజు వయస్సు కల పసిగుడ్డుగా వదలిపెట్టినపుడే భగవంతుడు నన్ను రక్షించాడే ఈనాడు అన్ని విధాలా బ్రతికే యోగ్యతగల నన్ను భగవంతు డెందుకు రక్షించలేడు? అపరాధం ఎవరు చేసినా ఒక్కటే కన్నతల్లియైనా, కట్టుకొన్న భార్య యైనా కన్నకూతురైనా అందరూ ఒక్కటే.

పౌరుషమూ, ఆత్మగౌరవమూ ఉన్నపుడు అలాంటి తల్లిని కన్నతల్లిగా ఎందుకు పరిగణించాలి? ఆమె మాతృమూర్తి కాదు. మృత్యుదేవత, రాక్షసి, దెయ్యం, భూతం.

సంపదా, గౌరవమూ, వంశమూ, కులమూ, ప్రతిష్ట, పేరూ వీటి కోసమని కన్నబిడ్డను పారవేసిన స్వార్థపరురాలు. ఆమెను చూడడమే మహాపాతకం! అలాంటి ఆలోచన నాలో కల్గించకు భగవాన్! అనుకొన్నాడు ప్రకాశరావు.

కానీ కొన్ని క్షణాలు గడిచాక అతనిలో మళ్ళీ ఆలోచన ఆరంభమైంది.

తొమ్మిది మాసాలు! తొమ్మిది మాసాలు మోసింది నన్ను. తాను గర్భిణి అని తెలిస్తే తన బ్రతుకే పోతుందనే భయంతో మోసింది. సంఘానికి భయపడింది. అబల! ఎంతైనా అబల! క్షత్రియ కన్య కుంతియే గంగకు అప్పజెప్పింది. సామాన్యురాలు ఏంచేస్తుంది? తల్లీ తండ్రీ బంధువులూ మిత్రులూ ఈ వలయంలో నన్ను త్యజించింది. ఇందులో ఆమె తప్పేముంది? దురదృష్టం నాదే. ఎంతైనా ఆమె కన్నతల్లి!

"అమ్మా! అమ్మా! అమ్మా!" నెత్తి బాదుకున్నాడు ప్రకాశరావు. కాస్సేపటికి తన్ను తానే ఓదార్చుకొన్నాడు. చివరికి అమ్మ దగ్గరకు వెళ్ళడానికే నిర్ణయించు కొన్నాడు.

"వెడుతాను, అమ్మ దగ్గరకు వెడుతాను. దూరంలో నుండైనా ఆమెను ఒక్కసారిగా చూస్తాను. ఆమె నా తల్లి అన్న విషయం ఆమెకు తెలిసినపుడు గదా

ఆమెకు ప్రమాదం. ఆమెకు తెలియకుండా ఆమెకు చెప్పకుండా ఆమెను దర్శిస్తాను. అమ్మను ఒక్కసారి చూచి ఆ వెనుక చచ్చినా నష్టం లేదు. నాకూ అమ్మ ఉంది. నన్ను కన్న తల్లి బ్రతికే ఉంది. నేను అనాధను కాను. తల్లి ఉంది."

ప్రకాశరావు బయలుదేరాడు. విశాఖపట్టణానికి టిక్కెట్టు కొన్నాడు. ఎంత దూరం? ఒక రాత్రి పూర్తిగా ప్రయాణం చెయ్యాలి? ఆ రాత్రల్లా అదే ఆలోచన.

తాను ఎవరని చెప్పాలి? నీబిడ్డనే అని చెబితే ఆమె పరువు పోతుంది. బ్రతుకు నవ్వులపాలౌతుంది. అలాంటి ప్రమాదం ఉండకూడదు. ఏదో నెపంతో ఆమెను చూడాలి.

* * *

ఆ మేడమీది నుండి చూస్తే సముద్రం కన్పిస్తుంది. విశాలమ్మ మేడమీది వసారాలో ఒక పడక కుర్చీలో పడుకొని సముద్రానికేసి చూస్తున్నది. ప్రకాశరావు గేటు దగ్గర నిలుచున్నాడు.

"ఎవరు కావాలి?" ఒక కుర్రాడు పలకరించాడు. బహుశా వాడు విశాల కొడుకై ఉంటాడు. ప్రకాశరావు తమ్ముడై ఉంటాడు.

"మాది మదరాసు. పనిలేకుండా వచ్చాను. ఇక్కడ ఏదైనా పని దొరుకు తుందేమోనని."

"తోటకు నీళ్ళు పోస్తావా? నాన్న రానీ చెబుతాను. అందాకా ఆ నీడన కూచో..." అంటూ వాడు వెళ్ళిపోయాడు.

పనిలేకుండా వచ్చానని మాటవరసకన్నాడు. తన వేషాన్ని చూచి కాయ కష్టం చేసే కూలీ అనుకున్నాడేమో! ఇలాగే వారం రోజులైనా ఇక్కడ తోటపని చేస్తూ అమ్మను చూస్తూ ఉండవచ్చు. ఆ వెనుక వెళ్ళిపోవచ్చు. ఏమైనా అమ్మతో మాట్లాడాలి. ఆ యవకాశం ఈవిధంగానైనా దొరుకుతుంది అనుకొన్నాడు ప్రకాశరావు.

ఐనా అతని హృదయంలో ఏదో తిరుగుబాటుతత్వం గోచరిస్తూ వుంది. ఆమె ఇంటివద్ద తోటమాలిగా ఉంటూ ఆమెను చూడకపోతేనేం? అది కన్నతల్లి కాదు. నరరూప రాక్షసి. సంపదకోసం సంతానాన్ని బలిచేసిన స్వార్థజీవి.

ఊహూ! ఎంత చెడ్డా ఆమె తల్లి! కన్నతల్లి! మాతృమూర్తి. అమ్మ! నవమాసాలు

మోసి కన్నటువంటి అమ్మ. అతని హృదయంలో ఆ వేగం ఎక్కువైంది.

ఇంతలో ఒక పచ్చని కారు వచ్చి ఆగిందక్కడ. అందులో నుండి ఒక పెద్దమనిషి దిగాడు. అతడు యజమాని కావచ్చు. కన్నతల్లిని పెళ్ళాడిన మారు తండ్రి కావచ్చు. అతడు ఊహించింది సత్యమే. పదినిమిషాలకల్లా అతడు కబురు చేశాడు. లోనికి వెళ్ళగానే తొలిప్రశ్న జీతం ఎంత కావాలని? తాను జీతం కోసమా వచ్చాడు?

"మీకు తోచినంత" అన్నాడు ప్రకాశరావు.

"నెలకు పన్నెండు రూపాయలు. రెండు పూటలా భోజనం. ఇదుగో ఈ పచ్చికను ఎప్పటికప్పుడు ఖచ్చితంగా కత్తిరిస్తుండాలి. చెట్లకు నిండుగా నీరు పోస్తుండాలి. ఉదయం సాయంకాలం పనిచేస్తే చాలు! ఇక వెళ్ళు" ఆజ్ఞాపించినట్టు అన్నాడు.

ప్రకాశరావు వెళ్ళబోతుండగా "ఇదిగో అబ్బాయ్! ఆ కారుషెడ్డులో నీ పడక. అన్నానికి ఒక పింగాణి ప్లేటు కూడా తెచ్చుకో" అన్నాడు యజమాని.

ఆ మాటలు విన్న ప్రకాశరావు నాలుక కరుచుకున్నాడు. పింగాణి పేట్లు కూడా తెచ్చుకోవాలట. అవును, తెచ్చుకోవాలి, ఒక్కవారం రోజులు అమ్మతో ఉండి వెళ్ళిపోవడానికి ఇట్లాంటి వాటికి ఓర్చుకోక తప్పదు.

ప్రకాశరావు పనిలో కుదిరాడు.

* * *

"హుందాగా దర్జాగానే అమ్మను కలుసుకొని ఉంటే తప్పేమిటి? తన చరిత్రను విన్నాక అమ్మ తనతోనే ఎందకు వచ్చి ఉండకూడదు? ఇట్లా తోటమాలిగా చాకిరీ చేస్తూ ఆమెను దొంగతనంగా కలుసుకోవడం అవమానం కాదూ?" ఇలాంటి ప్రశ్నలు వందపుట్టాయి తనలో. ఐనా తన్ను తాను సంతృప్తి పరచుకొన్నాడు. రెండవ కంటికి తెలియకుండా తల్లిని కలుసుకోవడమే ఉత్తమంగా తోచిందతనికి. ఆమె పూర్వ జీవితం మరుగున పడి ఉండడమే మంచిది. లేకుంటే ఆమెకున్న గౌరవం దెబ్బతింటుంది. ఆమె సంఘం దృష్టిలో చులకన కావడమటుంచి భర్త నుండి వేరుకావలసి వస్తుంది. తత్కారణంగా ఆమె జీవితమే సర్వనాశనమౌతుంది.

నాలుగు రోజులుగా అవకాశం కోసం యెదురు చూశాడు. ఆమె మేడ

నుండి క్రిందికి రావడమే అరుదుగా ఉంది. వచ్చినా ఎవరో ఒకరు వెంబడే ఉంటున్నారు.

ఐదవరోజు సాయంకాలం ఆమె తోటలో తిరుగుతూ ఉండగా 'అమ్మా' అంటూ కొంచెం దగ్గరకు రాబోయాడు. ఇంతలో వెనుకనుండీ ఆమె కూతురు మందలించింది. "అమ్మగోరు" అనాలిరా అబ్బీ. కొంచెం మాట్లాడడం కూడా నేర్చుకోవాలి" అన్నది వగలుపోతూ.

ప్రకాశరావు గుండెలు చివుక్కుమన్నాయి. అమ్మను "అమ్మా" అని పిలవ కూడదట. "అమ్మగోరూ" అనాలట. తోటమాలిగా ఉన్నవాడు యజమానురాలిని "అమ్మగోరూ" అనే పిలవాలిగా!

ఆ రాత్రి ఆలోచించాడు ప్రకాశరావు. అతని హృదయం ఆవేగంతో స్పందించి పోతున్నది. తనకు తెలియని ఏదో ఒక మహాశక్తి తన్ను నిర్బంధిస్తోంది. అమ్మతో మాట్లాడాలి. అమ్మా అని పిలవాలి. అమ్మను కౌగిలించుకోవాలి. అమ్మ ఒడిలో నిద్రపోవాలి. ఒక్కసారి అమ్మతో మాట్లాడితే చాలు. తన జన్మ ధన్యమైనట్లే. తన బ్రతుకు సార్థకమైనట్లే. తన జీవితం ఫలించినట్టే.

ఉన్నట్టుండి ప్రకాశరావు కారు షెడ్డులో నుండి బయటకు వచ్చాడు. మేడ మీదికేసి చూశాడు. చిన్నదీపం వెలుగుతోంది. గబగబా మేడ మెట్లెక్కి పైకి పోయాడు.

అమ్మ నిద్రపోతున్నది. చుట్టూ దోమతెర ఉన్నది. అవతలి గదిలో ఎవరూ లేరు.

"అమ్మా! అమ్మా!" సన్నగా పిలిచాడు.

ఆమె మెల్లగా కన్నులు తెరచింది.

"నేనమ్మా! నీ కొడుకును. తిరుపతిలో కన్న కొడుకును" అతడమాంతం ఆమె మీద వాలిపోయాడు.

ఆమె నివ్వెరపోయింది.

స్థాణువై పోయింది.

ఎన్నో క్షణాలు అలానే ఉండిపోయింది.

ఐదు నిమిషాలు గడిచిపోయాక ఆమె ప్రకాశరావును గట్టిగా కౌగిలించు కున్నది.

వెనుకనుండి ఒక బలమైన కఱ్ఱ ప్రకాశరావు నెత్తిమీద పడింది.

"అమ్మా!" అంటూ గావుకేక పెట్టి అతడు నేలమీదికి దొర్లిపడ్డాడు.

విశాలమ్మ వెనుదిరిగింది.

భర్త భయంకర స్వరూపం కన్పించింది. అతడు ఉన్మత్తుడై కోపోద్రేకుడై గట్టిగా అరిచాడు.

"ఛీ! పాతకీ.... తోటమాలితోనా...?"

విశాలమ్మ కళ్ళు తిరిగాయి. చుట్టూ వస్తువులు మనుషులు గిర్రున తిరుగుతున్నారు. కూర్చోలేక వాలిపోయింది.

ఏ దురాగతాన్ని తాను కప్పివేసుకొన్నానుకొన్నదో ఆ వ్యభిచార నేరమే తనమీద పడింది.

ఆ తోటమాలిని తన కొడుకని చెప్పే గుండెలు లేవు. చెప్పినా ఏం జరుగుతుంది?

ఐతే అతను ఎందుకు కౌగిలించుకున్నట్టు?

ఎంతటి విపత్కర పరిస్థితి?

"చెప్పవేం!" భర్త గర్జిస్తూ ఒక్క తన్ను తన్నాడా మంచాన్ని. ఆ మంచం ప్రకాశరావు మీద వాలిపోయింది. మంచం కోడి అతని గొంతుకలో గుచ్చుకొంటున్నది. ఎక్కడో విలవిలలాడే ప్రాణం "అమ్మా! అమ్మా!" అంటూ ఆక్రోశిస్తున్నది. ఏం చెబుతుంది. అమ్మ!